క్లుప్తంగా

చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎంగా సోమయాజులు



బాధ్యతలు స్వీకరిస్తున్న సోమయాజులు

మధురవాడ: రాష్ట్రంలో పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా ఎంఎస్‌వీఎస్ సోమయాజులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2017 నుంచి ఇక్కడ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇక్కడ పని చేసిన రాజబాబు రిటైర్ కావడంతో ఆయన స్థానంలో సోమయాజులు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అందరి సహకారంతో ఉత్తీర్ణత శాతం పెంచడానికి, క్రమశిక్షణను మరింత మెరుగు పరచడానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రోడ్డుపై కూలిన వృక్షం



చిన్నయ్యపాలెం వద్ద రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

ఆనందపురం: మండలంలోని కుసులువాడ పంచాయతీ చిన్నయ్యపాలెం వద్ద సింహాచలం -పద్మనాభం రూట్లో శుక్రవారం మర్రిచెట్టు అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో అటుగా ప్రయాణిస్తున్న కొన్ని వాహనాలు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు రోడ్డు పక్కను ఉన్న మర్రి వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లు, భవనాల శాఖ అధికారులు ముందస్తుగా వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చెట్టు కొమ్మలను తొలగించారు. శనివారం చెట్టును పూర్తిగా తొలగిస్తామని అధికారులు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డీ సాయినాథ సహిత దుర్గాలమ్మ ఆలయంలో పీఎంపాలెం పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, నిర్వాహకులు చేత అప్పలకుమార్, స్వర్ణంపూడి గణేష్, ఎస్.షన్ముఖరావు తదితరులు ప్రారంభించారు. భక్తులు, పాదచారులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన పూజలు, అనంతరం అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, పిళ్లా మోహన శివకృష్ణ, పిళ్లా శ్రీనివాసరావు, పోతిన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

పద్మనాభం: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన తాలాడ శ్రీను పద్మనాభం నుంచి బీసీ కాలనీకి మోటార్ బైక్‌పై ఆరు క్వార్టర్ బాటిళ్ల మద్యం తరలిస్తుంగా వాహనాలు చెక్ చేకింగ్‌లో పద్మనాభం రచ్చబండ వద్ద పట్టుబడ్డాడు. రెడ్డిపల్లి నుంచి జామి మండలం అన్నంరాజుపేటకు 10 క్వార్టర్ బాటిళ్ల మద్యం ఎన్నింటి అప్పలరాజు బైక్‌పై తరలిస్తుండగా మద్ది జంక్షన్ వద్ద పట్టుకున్నారు. తాలాడ శ్రీను, ఎన్నింటి అప్పలరాజులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మాకెందుకీ వేదన

- ఐదు రోజులు గడిచినా అందని పైనం
- చంద్రబాబు కుట్ర రాజకీయాలపై మండిపాటు

తగరపువలస: సామాజిక పింఛన్ల పంపిణీలో టీడీపీ అధినేత చంద్రబాబు కోర్టు ద్వారా పెట్టిన పితలాటకం కారణంగా ఐదు రోజులు గడిచినా పెన్షన్ల పంపిణీ పూర్తి కాలేదు. శుక్రవారం పబ్లిక్ హాలిడే కావడంతో సచివాలయాలు, బ్యాంకులు తెరచుకోలేదు. దీంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పంపిణీ కావాలసిన పింఛన్లు ఏ ఒక్కరికీ చేరలేదు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ జరిగేటప్పుడు ఎలాంటి అవరోధాలు ఉండేవి కాదని.. మళ్లీ ఆ రోజులు త్వరగా రావాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పింఛన్‌దారుల నోటికాడ కూడా లాగేయడానికి ప్రయత్నించిన కూటమిని తరిమికొట్టాలని పిలుపుఇచ్చారు.



శొంఠ్యాం సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

వృద్ధులను ఈసురోమనిపించారు



ఈ నెల పింఛన్లు పంపిణీకి చంద్రబాబు అడ్డం పడ్డాడని తెలిసి మనసు విలవిలలాడింది. అతను మాలాంటి వారిని ఆదుకుంది లేదు. ఆదుకున్న వారిని అడ్డుకుంటే కలిగే బాధ మాకే తెలుసు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు చంద్రబాబు చేయకు.

– సబ్బి ఎల్లయ్యమ్మ, బాలాజీనగర్

మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు



మాలాంటి అభాగ్యులకు నష్టం కలిగించే పనులు చంద్రబాబు చేశాడు. ఏమి కలిసి వచ్చిందో మరి. మేము ఒకటో తేదీన వచ్చే పింఛన్ కోసమే ఎదురు చూస్తుంటాం. మాకు ముందు వెనుకా ఎవరూ లేరు.

– దల్లి అప్పలరెడ్డి, తగరపువలస

పేదల పొట్ట కొట్టవద్దు



చంద్రబాబు పేదల పొట్ట కొట్టడానికి నీకు మనసెలా వచ్చింది. వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛను ఇస్తే నీకు కడుపుమంట ఎందుకు. మాకు నెలనెలా వచ్చే పింఛనే ఆధారం. దీనిని నువ్వు అడ్డుకోవాలని చూస్తే నీకే నష్టం.

– అంగటి ఎల్లమ్మ, తగరపువలస

‘భీమిలి’లో మళ్లీ ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండాయే



తాటితూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



టి.నగరపాలెం ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలిలో మరోమారు వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడంతో పాటు జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయిదేళ్ల పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధి కావాలంటే తనను, అయిదేళ్లకోసారి వచ్చి చేతిలో నాలుగు రూపాయలు పెట్టి మాయ మాటలు చెప్పేవారు కావాలంటే మరొకరిని ఎన్నుకోవాలన్నారు. నెలకు రూ.900 కోట్లు, 60 లక్షల మందికి పింఛను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. పీఆర్పీకి ఆ గతి పట్టడానికి కారణం గంటా శ్రీనివాసరావు అన్నారు. మళ్లీ జనసేన కార్యకర్తలు గంటా వలలో పడొద్దన్నారు. 2014లో తన వల్లే గంటా భీమిలిలో ఎమ్మెల్యే కాగలిగాడన్నారు. టి.నగరపాలెంలో రూ.13 కోట్లు, తాటితూరులో రూ.22 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రెండు పంచాయతీల్లో గోస్తనీ నదిపై వంతెన, కాజ్‌వేల నిర్మాణం కాంట్రాక్టర్ల కారణంగా ఆలస్యం అయిందన్నారు. భీమిలి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. టి.నగరపాలెం గ్రామ పంచాయతీకి ఢిల్లీ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా గుర్తింపు తీసుకొచ్చి రిపబ్లిక్ డే వేడుకల్లో అభినందనలు పొందిన సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అభినందించారు. సర్పంచ్‌లు పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, శిరుగిడి సంతోషి, ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సన్యాసిరావు, ఉండబట్ల ఆదిలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, దుంపల నాగమణి, రవ్వ ఈశ్వరరావు, రాజగిరి రామచంద్రరావు, కొయ్య శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, భాగం సుధాకర్, ఉండబట్ల చిన్నారావు, సింగిడి అప్పలరాజు, మద్దిల గురునాయుడు, జాంబిరెడ్డి, పూసర్ల ఎర్రయ్య, సరగడ వెంకట రమణారెడ్డి, మంగరాజు, పల్ల సూరిబాబు, నరేష్, గోవింద్, అప్పారావు, శ్రీను, నరేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.



టి.నగరపాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టితో ఆప్యాయంగా మాట్లాడుతున్న వృద్ధురాలు

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు



వెంకటలక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం, ప్రమాదంలో దెబ్బ తిన్న మోటార్ బైక్

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలి ఉన్నాయి. ఆర్. శంకరరావు గురువారం తన భార్య వెంకటలక్ష్మి (28), కుమారుడితో కలిసి మోటార్ బైక్‌పై విశాఖ నుంచి గజపతినగరం వెళ్తున్నాడు. చిన్నాపురం జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన స్కూటీ వారి బైక్‌ను ఢీకొంది. దీంతో గర్భవతి అయిన వెంకటలక్ష్మి తల, చేతులపై, కుమారుడి ముక్కు, పెదవులపై గాయాలయ్యాయి. వెంకటలక్ష్మిని విజయగనరం మహారాజ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వెంకటలక్ష్మి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం పంచాయతీకి చెందిన బొద్దపు సూర్యనారాయణను శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపాధి హామీ పనులకు వెళ్లి భార్య చిన్నమ్మలుకు భోజనం తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న అతన్ని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకు కూడా గాయాలయ్యాయి. గాయాలైన సూర్యనారాయణను స్థానికులు 108లో చికిత్సకు తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న పాలనలో భాగస్వాములవుతాం

తగరపువలస: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అయిదేళ్ల పాలనలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించామని సచివాలయ వలంటీర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు కుట్ర కారణంగా రెండు మాసాలు సేవలకు దూరమైనా ప్రజలకు దూరం కాలేదని మళ్లీ జూన్ నుంచి సీఎం జగన్ చొరవతో ఆయన పాలనలో భాగస్వాములం అవుతామని చెబుతున్నారు. భీమిలి నియోజకవర్గంలో ఇప్పటికే పలువురు వలంటీర్లు రాజీనామా బాట పట్టారు. మరి కొందరు అదే దారిలో ఉన్నారు. తమ రాజీనామాలను జెడ్పీ, ఎంపీడీవోలతో ఆమోదింపజేసుకుని ప్రజాక్షేత్రంలో ఉంటామని చెబుతున్నారు.



ఆదర్శనగర్ సచివాలయ కార్యదర్శి ఉషకు రాజీనామా లెటర్ అందిస్తున్న వలంటీర్ ప్రసాద్

భక్తిశ్రద్ధలతో ఆచార్య ప్రబోధానంద జన్మదిన వేడుకలు

పీఎం పాలెం : స్థానిక సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆచార్య ప్రబోధానంద జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి భక్తులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర హిందూ జ్ఞాన వేదిక సభ్యులు ఉషశ్రీ, ఎన్‌వీ రామకృష్ణ, త్యాగరాజు, శ్రీను, అప్పారావు, తవిటి రాజు, మహా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక గురువు ప్రబోధానంద జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 31 మందిని బలి తీసుకున్నారని చంద్రబాబుపై మండిపాటు



ఎమ్మెల్యే ముత్తంశెట్టిని సత్కరిస్తున్న నాయకులు



కాపులుప్పాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : అవ్వాతాతలకు పెన్షన్ రాకుండా అడ్డుకుని 31 మంది ప్రాణాలను చంద్రబాబునాయుడు బలి తీసుకున్నాడని, అధికారంలోకి రాకుండానే పరిస్థితి ఇలా ఉంటే.. వస్తే ఎలా ఉంటుందో ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ, ఎస్సీ కాలనీ, పరదేశిపాలెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇక్కడి రామాలయంలో శ్రీరాముడిని దర్శనం చేసుకుని ప్రచారం ప్రారంభించారు. గడప గడపకు వెళ్లి ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించారు. చంద్రబాబు ఏనాడు ప్రజల కోసం ఆలోచించలేదన్నారు. ఈ ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కొందరు రాజకీయం పేరుతో ఇక్కడ వ్యాపారం చేసేందుకు వచ్చారని, అలాంటి వారిని నమ్మొద్దని ప్రజలకు తెలిపారు. కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, ఎరుసు అప్పలకొండరెడ్డి, సాడి రమణ, కోడిబోయిన రమణ, పాలనాయుడు, వేముల ఈశ్వర్‌రెడ్డి, దేవాడ నాయుడు, ఎంట్రెడ్డి విష్ణు, మేరుగు చిన్నారావు, ఇల్లాపు వెంకట్రావు, దుంప సత్యం, వాండ్రాసి సన్యాసిరావు, కోడిబోయిన వరహాలు, సన్యాసిరెడ్డి, అప్పలరాజు, చంటి పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



కొత్త మూలకుద్దులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేములవలసలో ప్రచారం చేస్తున్న నాయకులు



రేఖవానిపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

తగరపువలస: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం భీమిలి మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు, జెండాలతో ఇంటింటా ప్రచారం చేశారు. రేఖవానిపాలెంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగశ్రీను, మల్లేటి హరిశంకర్ తదితరులు.. పాత మూలకుద్దు పంచాయితీలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత వీఆర్వో కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు కొల్లి కోటిరెడ్డి, కొల్లి రామకృష్ణ, గురయ్యనాయుడు, రామచిట్టి, కొయ్య రామకృష్ణ, వెంకటసత్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

ఆనందపురం: అన్ని వర్గాల వారికి మేలు చేసిన వైఎస్సార్‌సీపీని రానున్న ఎన్నికల్లో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ మండలంలోని వేములవలసలో శుక్రవారం నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు బంక సత్యం మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేని చెప్పారు. అందరి భవిష్యత్తు కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించుకోవాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి గంట్రెడ్డి శ్రీనివాస్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కోరాడ అప్పలస్వామి నాయుడు, మండల యూత్ పార్టీ అధ్యక్షుడు చందక అప్పలస్వామి, నాయకులు కోరాడ రాంబాబు, షిణగం అప్పలరాజు, పడాల రాము, షిణగం సత్యనారాయణ, పతివాడ నరిసింగరావు, కోరాడ వెంకటరావు, బూర్లె జగదీష్, బోద నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

ముత్తంశెట్టితోనే సమస్యల పరిష్కారం..

భీమునిపట్నం: జీవీఎంసీ మూడో వార్డు గొల్లవీధిలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిండంతోపాటు అన్ని పాంతాల్లోనూ గతంలో లేని విధంగా అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రజలందరూ ఎన్నికల్లో ఆయనను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతోపాటు విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజి, కోంద్రు రామసూర్యుడు, ఎ.సూర్యప్రకాశ్, ఆర్.ప్రభాకర్‌నాయుడు, పాసి స్వర్ణలత, ప్రగడ చంటి, కొంకి వెంకటేష్, బర్రి రాజు, నాగిరెడ్డి ప్రసాద్, పీతల శంకర్ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే అభివృద్ధి..

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డులో అభివృద్ధి అంటూ జరిగిందంటే సీఎం జగన్ పాలనలోనే అని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌చార్జి గాదె రోశిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం షిప్‌యార్డ్ లే అవుట్, సిద్ధార్థ కాలనీల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లే అవుట్‌లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. కార్పొరేటర్ బొట్ట అప్పలరాజు మాట్లాడుతూ లే అవుట్‌లో రూ. 3 కోట్లతో యోగా థీమ్ పార్కు నిర్మించినట్లు తెలిపారు. స్థానిక నాయకులు పోతిన ప్రసాద్, సూరిబాబు, వెంకటేశ్వర్లు, కాశీప్రసాద్, పి. రామకృష్ణ, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఎన్‌జీజీవోస్ కాలనీలో ప్రచార హోరు


మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు అపార్ట్‌మెంట్లు, నివాసాలకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్లపాటు నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కరించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాలు నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, చేకూరి రజని, ఎన్‌జీవోస్ కాలనీ పిళ్లా రమణ, మగ్గూరి వెంకటరావు, జగ్గపిళ్లి సాయి, కె.శ్రీదేవి, బంగారు ప్రకాష్, బెల్లాపు పాపారావు, పసుపులేటి గోపి, తమ్మినేని వరలక్ష్మి, డాక్టర్ సూర్యనారాయణ, ఎల్లాజీ, భాను, పద్మ తదితరులు పాల్గొన్నారు.



గొల్ల వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పీఎంపాలెం షిప్‌యార్డ్ లేఅవుట్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



7వ వార్డులోని అపార్ట్‌మెంట్ వద్ద ఓటు అభ్యర్థిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



రుషికొండ గిరిజన భవన్‌లో జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు



వేములవలసలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బెటాలియన్ అధికారులు, సిబ్బంది

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ భవన్‌లో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు నాగరాజు, డా.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జీవితం ఆదర్శం

ఆనందపురం: దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవితం ఆదర్శప్రాయమని వేములవలస సర్పంచ్ లంక కొండమ్మ చెప్పారు. వేములవలసలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండమ్మ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన జగ్జీవన్ రామ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర దళిత సంఘాల ప్రతినిధి భాగం గోపాలరావు మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు లెంక పైడిరాజు, సియ్యాద్రి రాంబాబు, తులసీరావు, లంక గణేష్, సూర్యనారాయణ, రాసర్ల సోమరాజు, మామిడి శివ, గంధవరపు కృష్ణ, కొట్యాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడిగా, జాతీయ నేతగా జగ్జీవన్ రామ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఏఆర్‌ఎస్ఐ నుంచి ఆర్‌ఎస్‌గా పదోన్నతి పొందిన ఆర్.శ్రీరాములను అధికారులు అభినందించారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఆర్‌ఐలు ఆర్‌ఎస్‌ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులంలో..

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి డీసీవో రూపావతి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ నేటితరానికి ఆదర్శమని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ గురుకులంలో జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గంజాయితో ఇద్దరి అరెస్టు

పీఎం పాలెం: గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పి. మహేష్, డి.చరణ్ కుమార్ సేవానగర్, కొమ్మాది జంక్షన్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బ్యాగ్‌లు తనిఖీ చేయగా కిలో గంజాయి వారి వద్ద లభించింది. వారిని ప్రశ్నించగా ఎర్చెర్ల వెంకటేశ్ ఉరఫ్ వెంకీబాయి అనే వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేశామన్నారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న కిలో గంజాయి, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాని సీఐ తెలిపారు.